క్లుప్తంగా

పేరంటాలమ్మ ఆలయ ఈఓ బదిలీ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.లోకేశ్వరిని మాచవరం దాసాంజనేయ స్వామి దేవస్థానానికి ఈఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అలాగే రాజమండ్రి సమీపంలోని రంగంపేట గ్రూప్ టెంపుల్‌లో కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రియాంక పేరంటాలమ్మ ఆలయానికి కార్యనిర్వహణాధికారిగా బదిలీపై వచ్చారు. రెండు రోజుల్లో ప్రియాంక బాధ్యతలు స్వీకరించనున్నారు.

వక్ఫ్ భూముల పరిరక్షణకు సమర్థంగా చర్యలు చేపట్టాలి

కంకిపాడు: వక్ఫ్ భూముల పరిరక్షణకు పాలకులు సమర్థంగా చర్యలు తీసుకోవాలని నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా కోరారు. ఈడుపుగల్లులోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిన్నా మాట్లాడుతూ వక్ఫ్ భూములు, తద్వారా వచ్చే ఆదాయాన్ని ముస్లింలకు వినియోగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం హర్షణీయమన్నారు. అయితే అన్యాక్రాంతమైన భూములను సైతం పరిరక్షించి వక్ఫ్ భూములు, ఆస్తులను ముస్లింల సంక్షేమానికి వినియోగించాలని కోరారు.

వరద బాధితులకు సాయం

కంకిపాడు: వరద బాధితులకు ఆపన్నహస్తం అందించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరారు. మండలంలోని తెన్నేరు, మంతెన, ఉప్పలూరు గ్రామంలో బుడమేరు ముంపుతో నష్టపోయిన 140 బాధిత కుటుంబాలకు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అందజేసిన కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఉప్పలూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు కిట్లను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ బండి శ్రీనివాసరావు, నాయకులు సుదిమళ్ల రవీంద్ర, కొండవీటి శివయ్య, నెరుసు సతీష్, పడవల మధుసూదన్‌రావు, తహసీల్దార్ వీ.భావన్నారాయణ, ఎంపీడీఓ పి.అనూష పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు అభినందించారు. కాలేజీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మా మట్టి - మా దేశం కార్యక్రమంలో భాగంగా వీఆర్ సిద్ధార్థ విద్యార్థులు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో సేకరించిన నీరు-మట్టిని ఢిల్లీలో అందజేశారు. విద్యార్థులు దేశంపై ఉన్న గురుతర బాధ్యతతో భక్తితో లక్ష్యం నెరవేర్చినందుకు అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం సేవించి బైక్ నడిపిన వ్యక్తికి జరిమానా

పెనమలూరు: మద్యం సేవించి బైక్ నడిపిన వ్యక్తికి కోర్టు రూ.10 వేలు జరిమానా విధించింది. ఎస్ఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22న వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో కంకిపాడుకు చెందిన పాతూరి ప్రవీణ్ అనే వ్యక్తి మద్యం సేవించి ఉండటంతో బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేశామన్నారు. అతను మద్యం సేవించినట్లు ధ్రువీకరించామని చెప్పారు. అతనిని విజయవాడ కోర్టులో పోలీసులు హాజరుపర్చగా కోర్టు రూ.10 వేలు జరిమానా విధించిందన్నారు. సీఐ వెంకటరమణ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మండల స్థాయి క్రీడాకారుల ఎంపికకు విశేష స్పందన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన మండల స్థాయి క్రీడాకారుల ఎంపికకు విశేష స్పందన లభించింది. బాపులపాడు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో సెలక్షన్స్‌కు తరలి వచ్చారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ క్రీడలకు బాలుర జట్ల ఎంపికలు జరిగాయి. ఆయా క్రీడల్లో విశేష ప్రతిభ కనపర్చిన విద్యార్థులను మండల స్థాయి క్రీడా జట్లకు ఎంపిక చేశారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంఈఓ-1, 2 శ్రీరామ్ బాలాసింగ్, బి.సురేష్‌కుమార్, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయులు బీఎస్ రామచంద్రుడు, సుబ్బారావు, లక్ష్మణరావు, రాజేష్, సాయి, బలరామ్ పాల్గొన్నారు.

నేడు నున్నలో అండర్ - 19 రెజ్లింగ్ ఎంపికలు

విజయవాడరూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ - 19 రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక బుధవారం నున్న జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు హైస్కూల్ పీఈడీలు విజయ్‌వర్మ, శ్రీలత తెలిపారు. వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రెజ్లింగ్ స్టేట్ మీట్‌కు ముందుగా ఎన్టీఆర్ జిల్లా నుంచి రెజ్లింగ్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు.

మురుగు నీటి నుంచి కానూరుకు మోక్షమెప్పుడు ?

- చినుకు పడితే కాలనీల మునక
- కలగానే డ్రైయిన్ల నిర్మాణం



మాణిక్యనగర్‌లో వర్షానికి మునిగిన కాలనీ(ఫైల్)

పెనమలూరు: మురుగు నీటి నుంచి కానూరుకు మోక్షమెప్పుడు లభిస్తుందోనని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. వర్షం చినుకుపడితే కానూరులో దాదాపుగా అన్ని కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. ఇళ్లల్లో నుంచి అడుగు బయట పెట్టడానికి అవకాశం ఉండటం లేదు. పైగా కాలనీల్లో మురుగునీరు నిలిచి పోవటంతో పరిస్థితులు చాలా దారుణంగా ఉంటున్నాయి. వివరాల్లోకి వెళితే కానూరు విజయవాడ నగరానికి పక్కనే ఉండటంతో గడిచిన కాలంలో చాలా నివాసాలు ఏర్పడ్డాయి. ప్రధానంగా అపార్టుమెంట్‌లు చాలా నిర్మించారు. కానూరు జనాభా దాదాపు 60 వేల మంది ఉన్నారు. అయితే గ్రామం పెరిగిన విధంగా అభివృద్ధి పనులు జరగలేదు. గ్రామంలో డ్రైయినేజీ సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడ డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవటంతో వర్షం పడితే గ్రామం ముంపునకు గురవుతుంది. కాలనీలన్నీ మురుగునీటితో విలయ తాండవం చేస్తున్నాయి.

ప్రణాళికలకే పరిమితం..

కాగా 2014-2019 సంవత్సరంలో టీడీపీ అధికారంలో ఉన్న కాలంలో కానూరుకు పక్కా డ్రైయినేజీల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దాదాపు రూ.30 కోట్లతో కానూరులో అన్ని ప్రాంతాల్లో డ్రైయినేజీల నిర్మాణం చేస్తామని సర్వే కూడా చేశారు. గ్రామంలో ప్రధాన చెరువులు సుందరీకరణ చేయటానికి అధికారులు వచ్చి పరిశీలించారు. సర్వే పూర్తి చేసిన తరువాత డ్రైయినేజీల నిర్మాణం పనులు ప్రారంభిస్తామని అప్పటి పాలకులు చెప్పారు. అయితే ఆచరణలో డ్రైయినేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ముందుకు కదలలేదు. గత ప్రభుత్వ హయాంలో పలు డ్రెయిన్లు నిర్మాణం చేసినా పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. దీంతో ఇప్పుడు గ్రామంలో డ్రైయినేజీల సమస్య అత్యంత ప్రధాన సమస్యగా మారింది. గ్రామం అభివృద్ధి చెందుతున్నందున డ్రైయినేజీల నిర్మాణానికి ప్రస్తుత పాలకులు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఖాళీ స్థలాలే శాపం..

కానూరు గ్రామానికి ఖాళీ స్థలాలే శాపంగా మారాయి. స్థలాల యజమానులు ఖాళీ స్థలాలు మెరక చేయక పోవటంతో మురుగునీరు ఇళ్ల మధ్యలో చేరుతుంది. డ్రైయినేజీలు లేకపోవటంతో మురుగునీరు పారుదల జరగటం లేదు. దీంతో దుర్గంధం రావటం, అనారోగ్య వాతావరణం ఉండటం, విషకీటకాల సంచారంతో గ్రామస్తులు బెంబేలెత్తి పోతున్నారు. మున్సిపాలిటీ అధికారులు ఖాళీ స్థలాల మెరక తోలించే విషయంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సిన అవసరం ఉంది. యజమానులకు నోటీసులు జారీ చేస్తే స్పందన కనబడుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కరించాలి



కానూరులో మురుగు నీటి సమస్య చాలా ఇబ్బందిగా ఉంది. వర్షం పడితే రోడ్లు, కాలనీలు మునుగుతున్నాయి. నిధులు మంజూరు చేసి వెంటనే డ్రైన్లు నిర్మాణం చేయాలి. మురుగు నీరు సమస్య పరిష్కారానికి అధికారులు వెంటనే స్పందించాలి.

– జోయల్, స్థానికుడు, కానూరు

సచివాలయాల చుట్టూ వరద బాధితుల ప్రదక్షిణలు



సచివాలయంలో పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందుతున్న బాధితులు

పెనమలూరు: కృష్ణానది వరదల కారణంగా ముంపునకు గురైన గృహ యజమానులు అధికారులు ప్రకటించిన జాబితాలో తమ పేర్లు లేవని లబోదిబోమంటున్నారు. గత నెల 30వ తేదీ నుంచి ఈ నెల 3వ తేదీ వరకు కృష్ణానదిలో వరద వచ్చింది. దీని కారణంగా యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల్లో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న అనేక గృహాలు వరద నీటిలో మునిగాయి. దీని వలన భారీగా ఆస్తి నష్టం జరిగింది. అధికారులు బాధితులను గుర్తించటానికి సర్వే చేయించి జాబితా ప్రకటించారు. అయితే జాబితాలో తమ పేర్లు లేవని బాధితులు ఆందోళన చెందుతున్నారు. అయితే సాంకేతక పరమైన కారణాల వలన బాధితుల సమస్య వచ్చిందని రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. మ్యాపింగ్ చేసిన వారి వివరాలు గతంలో మ్యాపింగ్ ఎక్కడ జరిగి ఉందో ఆ ప్రాంతంలో తహసీల్దార్ ఏరియా క్లస్టర్‌కు బాధితుల పేర్లు వెళ్లాయని చెబుతున్నారు. అలాగే కొందరి బాధితుల పేర్లు సర్వేలో నమోదు చేయలేదు. ఇలా అనేక కారణాల వలన వరద బాధితులను సక్రమంగా గుర్తించటంలో లోపాలు తలెత్తాయి. దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద బాధితులకు సమస్య పరిష్కరించటానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే బోడెను కలిసిన తాడిగడప కమిషనర్



పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.భవానీప్రసాద్ మంగళవారం స్థానిక శాసనసభ్యుడు బోడె ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్ భవానీప్రసాద్ ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి శాసనసభ్యుడు బోడె ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

దళితులపై దాడులను అరికట్టాలి

కంకిపాడు: దళితులపై రోజురోజుకీ దాడులు పెరిగిపోతున్నాయని, దాడులను అరికట్టడంలో పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారని వ్యవసాయ సలహా మండలి మండల మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు విమర్శించారు. కంకిపాడులో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నాయే కానీ దళితుల ధన, మాన, ప్రాణాలకు మాత్రం రక్షణ లేకుండా పోయిందన్నారు. దళితులకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమ స్వలాభం చూసుకుంటున్నారని వాపోయారు. రాజ్యాంగ నిర్మాతకే సముచిత గౌరవం ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితి రాష్ట్రంలో దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠినంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మ దహనం



హనుమాన్‌జంక్షన్‌లో రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించటంతో పాటుగా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ శరత్‌బాబు ఆధ్వర్యంలో రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. తొలుత బైక్‌లపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సీఎం, స్పీకర్, గవర్నర్ స్పందించాలి..

అనంతరం రాష్ట్ర మాల సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ.. బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే ఆ మహానుభావుడి ఫ్లెక్సీనే పెకిలించి వేయటం దారుణమన్నారు. టీడీపీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు తక్షణమే రఘురామకృష్ణంరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మంగరాజు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి చిక్కులు తప్పవని హెచ్చరించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ శరత్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు, శాసనసభ స్పీకర్, గవర్నర్ స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్‌ను కలిసి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఫిర్యాదు చేశారు. మాలమహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడదాసి జయపాల్, నాయకులు వీరవల్లి సునీల్ కుమార్, గోళ్ల నరేష్, పాలిమెట్ల మోసేస్, కొత్తూరు సాగర్, పండు నాగార్జున, శీలం రమణ, తోకల నాగరాజు, మద్దాల కిన్ను పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రజల్లో మూఢ నమ్మకాలను తొలగించి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి అభినందనీయమని స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక సాయి గీతాంజలి హైస్కూల్ ప్రాంగణంలో జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు-2024 పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్ష కార్యదర్శులు వీడీఎస్ ప్రసాద్, దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి పాఠశాల, మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెలమర్తి రవిబాబు, టీచర్లు శ్రీహరి, ఎంఎస్ఆర్ ప్రసాద్, పూర్ణచంద్ర ఆచార్యులు, దయాల ప్రభాకరరావు పాల్గొన్నారు.

వరద ముంపు పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో వ్యవసాయాధికారులు



గూడవల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



మారేడుమాకలో వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ కిరణ్, రైతులు



పోరంకిలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

ఉంగుటూరు: వరద నీటి ముంపునకు గురైన వరి పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ వి.హరీష్‌కుమార్ సూచించారు. పెద్ద అవుటపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉందని తగు మోతాదులోనే ఎరువులను వేయాలని పేర్కొన్నారు. అధిక ఎరువులు, పురుగు మందులు వాడటం వలన పెట్టుబడి వ్యయం పెరగడంతో పాటు సారం కోల్పోతుందన్నారు. ముంపునకు గురైన వరి పొలాలకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను తెలిపారు. అనంతరం పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఈఓ బి.దుర్గా నాగేశ్వరరావు, వీఏఏలు సరేంద్ర, రసూల్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొడ తెగులు నివారణకు చర్యలు

కంకిపాడు: వరి పంటను పొడ తెగులు నుంచి కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ సూచించారు. మండలంలోని తెన్నేరు, మారేడుమాక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి కిరణ్ మాట్లాడుతూ.. వరి పొలాల్లో పొడ తెగులు ఉధృతంగా ఉందన్నారు. తెగులు నుంచి పంటను కాపాడుకోవటానికి కాంటాఫ్, ప్లాంటామైసిన్ మందులు, దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే చెస్ మందు పిచికారీ చేయాలన్నారు. కాంటాఫ్ ఒక లీటరు మూడు ఎకరాలకు, ప్లాంటామైసిన్ 100 మిల్లీ లీటర్లు ఎకరాకు, దోమ నివారణకు చెస్ 100 గ్రాములు ఒక ఎకరాకు చల్లాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సురేష్, శివకృష్ణ పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులు వినియోగించాలి

రామవరప్పాడు: రైతులు పంటలకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సంప్రదాయ బద్ధమైన సేంద్రీయ ఎరువులను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని డిస్ట్రిక్ట్ రీసోర్స్ సెంటర్ ఏడీఏ ఎం.రత్నశ్రీ అన్నారు. విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రత్నశ్రీ మాట్లాడుతూ.. పురుగుల మందు వినియోగం అధికమైనప్పుడు ఆహార చక్రాన్ని ఎలా కలుషితం చేస్తుందో వివరించారు. వెటర్నరీ వైద్యులు ప్రసన్నలక్ష్మి మట్లాడుతూ గురక, చర్మ సంబంధిత వ్యాధులు పశువుల్లో ఎక్కువగా వస్తున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం అందించే పలు రాకల వ్యాక్సిన్లు, చూడి కట్టడంలో మినరల్ మిక్చర్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా స్ప్రేయర్లు, టార్పాలిన్స్ అందించాలని, రబీలో వేసే తెల్లజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వరరావు, ఏఈఓ సురేఖ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెనమలూరు: రైతులు పంట సాగు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ అన్నారు. పోరంకి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఓ శైలజ మాట్లాడుతూ.. అధిక వర్షాల కారణంగా నష్టపోయిన పంటలను రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించి దిగుబడులు సాధించాలని సూచించారు. తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని, కలుపు నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నున్నలో పొంగిన వాగు



నున్నలో పొంగుతున్న వాగు

నున్న(విజయవాడరూరల్): మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నున్న గ్రామంలో వాగు పొంగింది. నున్న, చిన నందిగామ సరిహద్దు ప్రాంతాల్లో కొండలపై కురిసిన వర్షానికి గుర్రాల చెరువు నుంచి పరుపువాగు పొంగి ప్రవహించింది. ఆ వాగు క్రమేపీ చినకంచి వద్దకు వచ్చే సరికి వికాస్ కాలేజీకి వెళ్లే రోడ్డుపై ఇరువైపులా 10 అడుగుల మేర వాగు ఉప్పొంగి, ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయి రాకపోకలు స్తంభించాయి. ఆ రోడ్డులో ఉన్న ఏకైక కల్వర్టు చిన్నది కావడంతో వాగు మరింత ఉధృతంగా ప్రవహించింది. కటిక చీకటి ఎటూ పోవడానికి వీల్లేక వికాస్ కాలేజీ నుంచి విజయవాడ వెళ్లే లెక్చరర్లు, విద్యార్థులు, ఇటు నుంచి జగనన్న కాలనీలో నివాసం ఉండే ప్రజానీకం కూడా తమ ఇళ్లకు వెళ్లడానికి వీల్లేక గంటలు తరబడి నిలబడి పోయారు. సుమారు 200 మంది రాకపోకలు లేక నిలిచిపోయారు. పోలీసులు వచ్చి ప్రజలను వాగుల వైపు వెళ్లకుండా చూశారు. రాత్రి 8 గంటలకు వాగు ఉధృతి తగ్గుముఖం పట్టడంతో డ్రోజర్‌తో స్థానికులు సహాయ చర్యలు చేపట్టారు. వాగులను ఆనుకొని ఉన్న పొలాల యజమానులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమణలతో వాగులు కుచించుకుపోయి పొంగి ప్రవహిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. వికాస్ కాలేజీ రోడ్డులో ఉన్న కల్వర్టు స్థానంలో వంతెన నిర్మించాలని గ్రామస్తులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాగును పరిశీలించిన అధికారులు

నున్నలో మంగళవారం రాత్రి పొంగి పొర్లుతున్న చినకంచి వద్ద వాగును అధికారులు పరిశీలించారు. అడిషినల్ డెప్యూటీ పోలీసు కమిషనర్ జి.రామకృష్ణ, విజయవాడ రూరల్ మండల తహసీల్దారు బత్తిన సుగుణ, ఎంపీడీఓ బి.భార్గవి, నున్న సీఐ పి.కృష్ణమోహన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర గ్రామసచివాలయ సిబ్బంది వాగును పరిశీలించారు. వాగు ప్రవాహం తగ్గిన పిమ్మట ప్రజలు రాకపోకలు సాగించాలని సూచన చేశారు.

రైతు సేవా, ఆరోగ్య కేంద్రాల ప్రారంభం



ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గన్నవరం: స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రం ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. జెడ్పీ బాలుర హైస్కూల్ గ్రౌండ్ పక్కన నిర్మించిన ఈ రెండు నూతన భవనాలను మంగళవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు సరఫరాతో పాటు సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న హాస్టల్ భవనం నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఉప సర్పంచ్ పాలడుగు నాని, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, మండల వ్యవసాయ అధికారి ఎన్ఎల్.తేజస్వి, ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు



బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామోపాధ్యాయులు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గత రెండు రోజులుగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి బాలబాలికల క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 300 మంది పాల్గొన్నారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం, యోగా, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాల బాలికలను మండల జట్టుకు ఎంపిక చేసినట్లు నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జి చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఇదే క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గ క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. హైస్కూల్స్ హెచ్‌ఎంలు నిమ్మగడ్డ రవీంద్రభవాని, కె.ఎస్.జగదీశ్వరరావు, సింగ్, కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్. కిశోర్, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే మాతా శిశు ఆరోగ్య సంరక్షణ



ప్రొద్దుటూరులో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అన్నామణి తదితరులు

కంకిపాడు: పౌష్టికాహారంతోనే మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సాధ్యమని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. కంకిపాడు సెక్టార్ పరిధిలోని ప్రొద్దుటూరు, దావులూరు, కొణతనపాడు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ప్రొద్దుటూరు ఎంపీపీ పాఠశాలలో మంగళవారం సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఈడా శివనాగలక్ష్మి గర్భిణులకు చీర, సారె అందించి ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. సూపర్‌వైజర్ అన్నామణి మాట్లాడుతూ.. గర్భిణులు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పోషకాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ వైద్యుడు గోగినేని భాస్కరరావు మృతి



హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌కు చెందిన సీనియర్ వైద్యుడు గోగినేని భాస్కరరావు(87) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. దాదాపు 56 సంవత్సరాలుగా డాక్టర్ గోగినేని భాస్కరరావు హనుమాన్‌జంక్షన్‌లో వైద్యశాలను నిర్వహిస్తూ తనకంటూ ఓ ప్రత్యేక ఆదరణను సొంతం చేసుకున్నారు. కొద్దికాలంగా బీజేపీలో క్రియాశీలంగా వ్యవహరించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. డాక్టర్ గోగినేని భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, డాక్టర్ దుట్టా రామచంద్రరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ, పుర ప్రముఖులు వీరమాచినేని సత్యప్రసాద్, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, గుండపనేని ఉమావరప్రసాద్, డీవీ రమణ, వేగిరెడ్డి బాలాజీ, వేములపల్లి శ్రీనివాసరావులు ఆయన మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

గడియారం వితరణ

గన్నవరంరూరల్: మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయానికి గ్రామానికి చెందిన అన్నే రమ్యకృష్ణ మంగళవారం వితరణగా గోడ గడియారం అందజేశారు. పాఠకులకు ఉపయోగపడే విధంగా ఈ గడియారం దాత అందజేసినట్లు లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

కంకిపాడు: అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉప్పలూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నెల కొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ ప్రయోజనాలు చేకూరేలా కృషి చేస్తామన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ లాం సోనియా, ఎంపీటీసీ లాం పార్వతి, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ వి.భావన్నారాయణ, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.